సాక్షి అనంతపురం

మంగళవారం । 31 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.12 పలికింది.



జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

రబీ పంటలు నమోదు చేసుకోవాలి



శివపురం వద్ద వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ చంద్రానాయక్

శింగనమల: రబీలో సాగైన పంటలు నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని శివపురం, సి.బండమీదపల్లి, కల్లుమడి గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. ఎరువులను మోతాదుకు మించి వాడరాదని రైతులకు సూచించారు. కోత దశలో పచ్చి రొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. వరి మాగాణిలో మొక్క జొన్న పంట మార్పిడి గురించి వివరించారు. ఆర్బీకేల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ పెండింగ్ ఉన్న రైతులు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. పంట సాగు ధ్రువీకరణ పత్రం పొందిన రైతులకు బ్యాంక్‌లో పంట రుణాలు మంజూరు చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిన్నమ్మ, వ్యవసాయ సిబ్బంది అమరేష్, నవీన్ పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తుకు గతంలో ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా దరఖాస్తుకు ఇబ్బందులు తలెత్తడంతో గడువు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు.

విషపూరిత ద్రావకం తాగి హోంగార్డు మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పొరబాటున విషపూరిత ద్రావకం తాగి ఓ హోంగార్డు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... జిల్లా పోలీసు శిక్షణ కళాశాలలో హోం గార్డుగా పనిచేస్తున్న సునీల్‌కుమార్ (41), ప్రసన్నకుమారి దంపతులు. వివాహమైన చాలా కాలం తర్వాత ప్రసన్న కుమారి గర్భం దాల్చింది. ఈ క్రమంలో ఆమెను సునీల్ కుమార్ జాగ్రత్తగా చూసుకుంటూ వస్తున్నారు. సోమవారం దాహం వేస్తుండడంతో బాటిల్‌లో ఉన్న ద్రావకాన్ని పొరబాటున నీరుగా భావించి సునీల్ కుమార్ తాగాడు. కాసేపటి తర్వాత వాంతులయ్యాయి. స్పందించిన కుటుంబసభ్యులు విషయాన్ని తెలుసుకుని వెంటనే సర్వజనాస్పత్రికి పిలుచుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నగర శివారులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక సోమవారం సాయంత్రం సునీల్‌కుమార్ మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు తెలిపారు.

వైద్య సౌకర్యాలపై ఎన్‌ఎంసీ బృందం సంతృప్తి



ఎంఎం వార్డులో రోగిని పరీక్షిస్తున్న ఎన్‌ఎంసీ బృందం సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, వైద్య కళాశాలలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) బృందం సోమవారం ఉదయం పర్యటించింది. బృందం సభ్యులు అరుణ్ దాసన్, విభ, కేవీ సతీష్, మరిరాజ్, ప్రియ సెంథిల్‌కుమార్, లేఖరాజ్, అరవింద్‌కుమార్, సిజో జోసెఫ్ వైద్య కళాశాలలో విభాగాధిపతులతో, వైద్య బృందంతో బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వజనాస్పత్రిలో ఆర్థో, ఎంఎం వార్డు, ఎఫ్ ఎం వార్డు, క్లినికల్ వార్డుల్లో తిరిగి రోగులతో వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య విద్య బోధన, వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మైరెడ్డి నీరజ, సర్వజనాస్పత్రి సూపరింటిండెంట్ రఘునందన్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, వైద్యులు శ్రీనివాసనాయక్, నీలిమ, సునీత, శ్రీదేవి, షారోన్ సోనియా, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, ప్రవీణ్‌దీన్ కుమార్, పద్మ శ్రావణి, శ్రీనివాసరావు, ప్రవీణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- చేతివృత్తిదారుల మోములో ఆనందం
- 'జగనన్న చేదోడు' కింద 14,882 మందికి లబ్ధి
- రూ.14.882 కోట్ల మెగా చెక్కు విడుదల చేసిన విప్, కలెక్టర్





'జగనన్న చేదోడు' మెగా చెక్కు విడుదల చేస్తున్న విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, హాజరైన లబ్ధిదారులు

అనంతపురం అర్బన్: నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శాసనమండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. అన్ని వర్గాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. షాపులున్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు 'జగనన్న చేదోడు' పథకం మూడో విడత కింద రూ.10వేల చొప్పున నగదును కంప్యూటర్ బటన్ నొక్కి బ్యాంకు ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని సోమవారం వినుకొండలో సీఎం లాంఛనంగా ప్రారంభించారు. చేతివృత్తిదారుల్లో ఆనందం వెల్లి విరిసింది. అనంతపురం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కార్యక్రమంలో శాసన మండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్ నాగలక్ష్మి మెగా చెక్కును విడుదల చేశారు. సీఎం అభినందన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. శాసన మండలి విప్, కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 9,580 మంది రజకులు, 3,020 మంది నాయీబ్రాహ్మణులు, 2,282 టైలర్లు మొత్తం 14,882 మందికి రూ.14.882 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. లబ్ధిదారులు ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ బీసీల ఆర్థికాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌గర్ రిజ్వాన్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం.. మంచి నిర్ణయం



కులవృత్తులు చేసుకునే వారికి ఆర్థికసాయం అందించడం మంచి నిర్ణయం. 'జగనన్న చేదోడు' పథకం కింద ఏటా రూ.10 వేలు ఇస్తున్నారు. మాలాంటి పేదలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. ఆ డబ్బుతో మాకు నచ్చిన పనిముట్లు కొనుక్కుంటాము.
– దివ్యభారతి, మున్నానగర్, అనంతపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



కులవృత్తిదారులతో పాటు టైలర్లకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల ఆర్థికసాయంతో పనిముట్లు కొనుగోలు చేస్తున్నాము. సచివాలయ ఉద్యోగులకు, విద్యార్థులకు యూనిఫాం తప్పనిసరి చేయడంతో మాకు కుట్టుపని ఆర్డర్లు పెరిగాయి.
– పరమేశ్వరరెడ్డి, టైలర్, శారదానగర్, అనంతపురం

బాధ్యతగా అర్జీలు పరిష్కరించాలి

- 'స్పందన'లో 328 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తూ సమస్యలు వింటున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: 'స్పందన' అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 328 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. 'స్పందన'లో అందే అర్జీలను నేరుగా ముఖ్యమంత్రి సమీక్షిస్తారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యం కనిపించకూడదని హెచ్చరించారు.

అర్జీల్లో కొన్ని..

- సర్వే నంబరు 500లో సాగు చేసుకుంటున్న మూడెకరాల భూమికి పట్టా ఇప్పించాలని కణేకల్లు మండలం టి.వీరాపురానికి చెందిన జి.మారెప్ప అర్జీ అందజేశాడు.
- తాడిపత్రి మండలం ఆటోనగర్ పాలిటెక్నిక్ కళాశాల భూమిలో ఇళ్లు నిర్మించుకున్న 40 మంది తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

కేటాయింపుల్లో కూత పెట్టేనా?

- రేపు కేంద్ర బడ్జెట్..
- ధర్మవరం – బళ్లారి నూతన రైలుమార్గానికి నిధులు వచ్చేనా?
- గుంతకల్లు జంక్షన్ నుంచి ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలైనా పట్టాలెక్కేనా?



గుంతకల్లు జంక్షన్ స్టేషన్

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయపరంగా గుంతకల్లు డివిజన్ ముందంజలో ఉంది. అయితే ఈ డివిజన్‌కు ప్రతి బడ్జెట్‌లోనూ అన్యాయం జరుగుతూనే ఉంది. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా న్యాయం చేస్తారేమోనని జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పేరుకే డివిజన్ కేంద్రం..

గుంతకల్లు రైల్వే డివిజన్.. దేశంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇంధన పొదుపులో రెండో స్థానంలో అవార్డు దక్కించుకోగా, ఇక స్టేషన్ బిల్డింగ్ ఎయిర్ పోర్టు తరహాలో ఉందని స్వయాన రైల్వే మంత్రి స్టేషన్ బిల్డింగ్ ఫొటోలను ట్విట్టర్ ద్వారా పోస్టు చేసి కితాబు ఇచ్చారు. ఇంతటి పేరుగాంచిన డివిజన్ కేంద్రం గుంతకల్లులో ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు ఇక్కడి నుంచి ప్రారంభానికి నోచుకోలేదు. ఈ బడ్జెట్‌లోనైనా కనీసం గుంతకల్లు జంక్షన్ నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రకటించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నత్తనడకన ప్రాజెక్టులు

- 2016-17 బడ్జెట్‌లో గుంతకల్లు – గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టు ప్రకటించారు. మొత్తం 401 కి.మీ డబ్లింగ్ పనులకు రూ 3,631 కోట్లు మంజూరు చేశారు. గడిచిన బడ్జెట్‌లో రూ.803 కోట్లు కేటాయించారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు 92 కి.మీ మేర డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ – విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించడానికి అనువుగా ఉంటుంది.
- కడప – బెంగళూరు మధ్య కొత్త ప్రాజెక్టుకు 2008-09లో ప్రణాళికలు తయారు చేసి రూ.2,706 కోట్లు కేటాయిస్తూ పనులు ప్రారంభించారు. మొత్తం 255 కి.మీ పొడవు కల్గిన ఈ మార్గంలో ఇప్పటివరకు 21 కి.మీ కడప – పెండ్లిమర్రి మార్గం మాత్రమే పూర్తయింది. గత బడ్జెట్‌లో రూ.289 కోట్లు కేటాయించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టుబట్టి దక్కించుకున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే కడప, అనంతపురం జిల్లా వాసులకు బెంగళూరు నగరం మరింత దగ్గరవుతుంది.

నైరుతి డివిజన్ పరిధిలోని...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు రైల్వేస్టేషన్లు బెంగళూరు డివిజన్ (నైరుతి రైల్వే) పరిధిలోకి వస్తాయి. రాయదుర్గం – కళ్యాణదుర్గం – తుమకూరు మధ్య 213 కిమీ నూతన రైలు మార్గానికి గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. అదేవిధంగా చిక్‌బళ్లాపూర్ – పుట్టపర్తి మధ్య 103 కి.మీలు, యలహంక – పెనుకొండ – ధర్మవరం మధ్య డబ్లింగ్ రైలు మార్గానికి రూ.114 కోట్లను గత బడ్జెట్‌లో కేటాయించారు.

సర్వే చేసిన నూతన రైలు మార్గాలు..

గత బడ్జెట్లలో కొత్త రైలు మార్గాల కోసం సర్వేలకు అనుమతిస్తూ ప్రతిపాదనలు కోరింది. ఆయా ప్రాజెక్టులకు డివిజన్ అధికారులు సర్వేలు పూర్తి చేసి నివేదికలను జోనల్ అధికారులకు ఇదివరకే పంపారు. ఈ బడ్జెట్‌లో నిధులు వస్తే రైలు మార్గాలు లేని ప్రాంతాల్లో కొత్తవి నిర్మించి రైళ్ల పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది.

- ధర్మవరం – బళ్లారి 110 కి.మీల రైలు మార్గం
- రాయచోటి – హిందూపురం 162 కి.మీ మార్గం
- మంత్రాలయం – కర్నూలు 100 కి.మీ మార్గం
- ముద్దనూరు – ముదిగుబ్బ 90 కి.మీ మార్గం

కొత్త రైళ్ల ప్రతిపాదనలు...

- ధర్మవరం – గుంతకల్లు – కాచిగూడ డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు
- పుట్టపర్తి నుంచి షిర్డీకి కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు
- చెన్నై నుంచి హైదరాబాద్‌ల మధ్య పగటిపూట ఎక్స్‌ప్రెస్ రైలు
- గుంతకల్లు –హైదరాబాద్, గుంతకల్లు– విజయవాడల మధ్య పగటిపూట ఎక్స్‌ప్రెస్ రైలు
- సికింద్రాబాద్ నుంచి కర్నూలు మధ్య నడుస్తున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకు పొడగించాలి



పచ్చ పత్రికల్లో వస్తున్నవన్నీ తప్పుడు రాతలే

- నాది తప్పని నిరూపిస్తే రాజకీయాల నుంచి ఫైదొలుగుతా
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు : తన గురించి పచ్చ పత్రికల్లో వస్తున్న వార్తలన్నీ తప్పుడివేనని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆ కథనాలు నిజమని, తాను తప్పు చేశానని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ చేశారు. సోమవారం రామినేపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుదారు. రాప్తాడు నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బంది పడాలనేదే ఎల్లో మీడియా ఆలోచన అని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన తెలుగుదేశం అధినేత చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో పీఠం ఎక్కించడానికి పచ్చ పత్రికాధిపతులు ఆపసోపాలు పడుతున్నారన్నారు. చంద్రబాబును, ఆయన తనయుడు లోకేష్‌ను ప్రజల్లో గొప్పగా చిత్రీకరించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలపై దుర్మార్గపు రాతలు రాసి తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని విమర్శించారు. గడిచిన 42 నెలలుగా ఎల్లో మీడియా తనపై రాసిన వార్తల్లో ఏవైనా సరే .. అందులో తాను చిన్న తప్పు చేసినట్లు నిరూపించినా తనతో పాటు కుటుంబ సభ్యులందరమూ శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటామన్నారు. ఈ తప్పుడు కథనాలపై సీబీఐ ద్వారా విచారణ కావాలని హైకోర్టును మీరు కోరినా సరే.. లేదా తననే లేఖ రాయమన్నా రాస్తానని అన్నారు. ఆరోపణలను నిరూపించలేకపోతే పచ్చ పత్రికల అధిపతులు అనంతపురం వచ్చి తమకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై కానీ, కుటుంబంపై కానీ తప్పుడు వార్తలు రాస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

లోకేష్ యాత్రకు జనం కరువు

లోకేష్ 'యువగళం' యాత్రకు జనం కరువయ్యారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. తొలిరోజే నందమూరి తారకరత్న గుండెపోటుకు గురయ్యాడని, ఇవన్నీ చూస్తుంటే రాష్ట్రానికి పట్టిన అరిష్టం చంద్రబాబు, లోకేష్ అని ప్రకృతి సంకేతాలిస్తున్నట్లుగా అనిపిస్తోందన్నారు. నాడు వైఎస్ జగన్ 'ప్రజా సంకల్ప యాత్ర'కు జనం తండోప తండాలుగా వచ్చారని గుర్తు చేశారు. జన బలమున్న జగన్‌ను ఈసారి ఎన్నికల్లో అడ్డుకోవడం ఎవరి తరమూ కాదన్నారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికీ మేలు జరుగుతోందన్నారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా జనం నమ్మే పరిస్థితిలో లేరన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు ప్రజల్లో లేని వ్యక్తులని విమర్శించారు. కరోనా కష్ట కాలంలో రాష్ట్ర ప్రజలను సీఎం జగన్ కంటి రెప్పలా కాపాడుకున్నారన్నారు. చంద్రబాబు, పరిటాల సునీత కరోనాకు భయపడి హైదరాబాద్‌లో తలదాచుకొని, కార్యకర్తలు, నాయకులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఉచిత సలహాలు ఇచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది తదితరులు పాల్గొన్నారు.

వధువు కావాలా.. నాయనా?

- మ్యారేజ్ బ్యూరో ముసుగులో మోసాలు
- అమ్మాయిల ఫొటోలు మాత్రమే చూపి పెళ్లి ఖరారు
- ముహూర్త సమయానికి సీన్ రివర్స్
- లబోదిబోమంటున్న వరుడి కుటుంబాలు

హిందూ వివాహాల్లో పెళ్లి చూపులు ఒక ప్రధానమైన ఘట్టం. కాబోయే వధువు, వరుడు ఒకరినొకరు చూసుకునే తొలిఘట్టం. ఇరువైపు బంధువులు కలుసుకొని, ఒకరి గురించి ఒకరు తెలుసుకునే సందర్భం ఇది. ఇదివరకు బంధువులు, పరిచయస్తులు మధ్యవర్తిగా ఉండి ఇరు కుటుంబాల వారికీ అమ్మాయి, అబ్బాయిని చూపించి.. పెళ్లి సంబంధాలు కుదుర్చేవారు. అయితే చదువు పూర్తిచేసి.. ఉద్యోగంలో స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకుందామనే నిర్ణయానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో వయసు దాటిన తర్వాత పెళ్లికి సిద్ధమైతే వధువు దొరకడం లేదు. ఇటువంటి వారిని లక్ష్యంగా చేసుకుని రాజమండ్రికి చెందిన కొంతమంది మ్యారేజ్ బ్యూరో పేరుతో రంగంలోకి దిగుతున్నారు. ఫొటో ఒకరిది చూపి.. డబ్బు రాబట్టుకుని.. పెళ్లి మరొకరితో చేయడానికి ప్రయత్నిస్తూ వరుడి తరపు కుటుంబాలను మోసం చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.



అనంతపురం: జిల్లాలో ఎంతోమంది యువకులు వయసు మీదపడుతున్నా కల్యాణ గడియలు కలసిరావడం లేదు. అమ్మాయిలు తమకు కాబోయే జీవిత భాగస్వామి ఎంపికలోనూ మార్పు వచ్చింది. ఉన్నత చదువు.. మంచి ఉద్యోగం.. మెరుగైన వేతనం.. ఆస్తిపాస్తులు.. కుటుంబ నేపథ్యం బాగుండాలని ఆశిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా కుమార్తెల అభిప్రాయానికి విలువనిచ్చి.. అలాంటి వారిని ఎంపిక చేసుకోవడంపై దృష్టిసారిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పలు వ్యాపారాలు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి, వ్యవసాయ రంగాల యువకులకు అమ్మాయిలు దొరకడం కష్టమవుతోంది. ఎంతలా అంటే కన్యాశుల్కం అంటే.. అమ్మాయికే ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకునే స్థాయికి వెళ్తున్నారు. ఇలాంటివి జిల్లాలో అక్కడక్కడా జరుగుతున్నాయి. అమ్మాయిలు దొరక్క విసిగివేసారిపోయిన యువకులు, వారి తల్లిదండ్రులు మ్యారేజ్ బ్యూరోలను సంప్రదిస్తున్నారు. కొందరు బ్యూరో నిర్వాహకులు డబ్బు కోసం మోసాలకు పాల్పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నిలువునా మోసపోక తప్పదని పలు ఘటనలు హెచ్చరిస్తున్నాయి.

మ్యారేజ్ బ్యూరో మోసాల్లో మచ్చుకు...

- అనంతపురంలో నివాసం ఉంటున్న రాముడు (పేరుమార్చాం) సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. రాముడు తన సోదరుడికి పెళ్లి సంబంధం కుదుర్చుకోవడానికి రాజమండ్రికి చెందిన మహిళా పెళ్లిళ్ల పేరయ్య (బ్రోకర్)ను సంప్రదించారు. మొదట ఒక అమ్మాయి ఫొటో చూపించారు. పెళ్లికొడుకు సమ్మతి తెలపడంతో.. రూ.5 లక్షల నగదును పెళ్లికూతురు తండ్రికి ఇవ్వాలని.. పెళ్లి నిర్వహణ పెళ్లికొడుకు వారే బాధ్యత తీసుకోవాలని బ్రోకర్ చెప్పారు. వారు ఒప్పుకుని నగదు చెల్లించారు. తర్వాత 15 రోజులకు పెళ్లికొడుకు కుటుంబ సభ్యులతో కలిసి 20 మంది దాకా పెళ్లి అనుకున్న సమయానికి రెండు రోజుల ముందే రాజమండ్రికి చేరుకున్నారు. అక్కడ పెళ్లి కూతురు మారిపోయింది. తొలుత తమకు ఫొటోలో చూపించిన అమ్మాయి కాదు కదా అని పెళ్లి కుమారుడి వారు ప్రశ్నిస్తే.. 'ఆ అమ్మాయి తండ్రికి ఆరోగ్యం బాగోలేదు. పెళ్లి చేయడం ఇప్పుడు కుదరదు. కావున ఈ అమ్మాయిని పెళ్లి చేసుకోండి' అని మహిళా బ్రోకర్ తాపీగా సమాధానమిచ్చారు. చేసేది లేక పెళ్లి కొడుకు కుటుంబం వెనక్కు వచ్చేసింది.
- ఇలా పెళ్లికాని యువకులను లక్ష్యంగా చేసుకుని మోసగించే వారి సంఖ్య ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. పెళ్లి సంబంధాలు కుదుర్చుతామంటూ వల వేసి భారీగా నగదు, బంగారు నగలు గుంజుతున్నారు. చివర్లో ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు.

జిల్లాలో యువకుల గణాంకాలు

20 నుంచి 29 సంవత్సరాల్లోపు వారి సంఖ్య
3,25,218

30 నుంచి 39 సంవత్సరాల్లోపు వారి సంఖ్య
5,86,395

బ్రోకర్ల మాట నమ్మొద్దు



అమ్మాయిల కొరతను ఆసరాగా చేసుకుని పెళ్లిళ్ల పేరుతో కొందరు బ్రోకర్లు అనేక మోసాలకు పాల్పడుతున్నారు. బ్రోకర్ల వలకు చిక్కకుండా మనమే జాగ్రత్తగా ఉండాలి. రెండు కుటుంబాలు ఒక అభిప్రాయానికి వచ్చాక మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా మాట్లాడుకోవాలి. బ్రోకర్లను ఒక పరిధి వరకే పరిమితం చేయాలి.
–మేడా రామలక్ష్మి, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్, అనంతపురం

సేవాభావంతో పనిచేస్తున్నాం



మ్యారేజ్ బ్యూరో ద్వారా ఆరేళ్లుగా అనేక వివాహాలు కుదిర్చాం. ప్రతిఫలం ఆశించకుండా సేవా కార్యక్రమంగా భావిస్తూ బంధువులు, స్నేహితులకు సేవ చేస్తున్నాం. రిజిష్టర్డ్ మ్యారేజ్ బ్యూరోలనే నమ్మాలి. కొత్తవారిని, మధ్యవర్తిగా నమ్మకూడదు. పెళ్లి అంటేనే పవిత్ర కార్యంలా భావిస్తున్నాం.
– రొద్దం సురేష్ రెడ్డి, మ్యారేజ్ బ్యూరో నిర్వాహకుడు, అనంతపురం

రెండు కుటుంబాల మధ్య వారధి పెళ్లి



పెళ్లి అనేది రెండు కుటుంబాల మధ్య వారధి లాంటిది. ఒకటికి పదిసార్లు ఆలోచించి అడుగు వేయాలి. వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్‌లో సంబంధాలు చూసి మోసపోకూడదు. ఈ మధ్య వెబ్‌సైట్‌ల్లో సంబంధాలు చూసి పెళ్లి దాకా వెళ్లి ఆగిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఏ రకంగా మోసం చేసినా కేసు నమోదు చేసి చట్టపరమైన న్యాయం కోరవచ్చు.
–బద నారాయణరెడ్డి, న్యాయవాది, అనంతపురం

క్లుప్తంగా

స్పందించిన మానవతావాది



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి టౌన్: 'విధి వంచితులు' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై తాడిపత్రికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు స్పందించారు. సోమవారం ఉదయం వడ్లపాలెంలోని దస్తగిరిమ్మ ఇంటికి వెళ్లి పలకరించారు. వారి జీవన స్థితిగతులపై ఆరా తీశారు. బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న చిన్నారులను పరిశీలించి, ఆశ్రయం కల్పించిన అవ్వ దస్తగిరిమ్మను అభినందిస్తూ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఆర్టీ రామచంద్రారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

కల్లూరులో చోరీ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన నాగలక్ష్మి, కదిరప్ప దంపతులు సోమవారం తెల్లవారుజామున ఇంటికి తాళం వేసి పాడి పశువులకు మేత తీసుకువచ్చేందుకు పొలానికి వెళ్లారు. విషయాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 7 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. పశువుల గడ్డి తీసుకుని ఇంటికి చేరిన కదిరిప్ప దంపతులు తాళం బద్దలుగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని నగలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ప్రభాకర్..పద్ధతి మార్చుకో

- శరీరం కూడా సహకరించదే.. ఎందుకీ రోషాలు, పౌరుషాలు?
- చిల్లర రాజకీయాలు మానుకుని, గౌరవంగా బతుకు
- మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు

తాడిపత్రి: 'వయసు, శరీరం సహకరించని స్థితిలో ఉన్న నీకు ఎందుకీ రోషాలు, పౌరుషాలు? చంపుతా, పొడుస్తా, చూసుకుందాం.. అంటూ తరచూ ప్రగల్భాలు పలకడం మానుకో. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ఇకనైనా స్వస్తి చెప్పు' అంటూ తాడిపత్రి మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు చెప్పారు. సోమవారం ఆయన పెద్దవడుగూరు మండలంలో చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా కదరగుట్టపల్లిలో విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..''30 ఏళ్ల రాజకీయం చేసిన నీకు కాస్తయినా సిగ్గుండాలి. పౌరుషాలు అందరికీ ఉంటాయి. ఇప్పుడు కాదు కానీ మీరు అధికారంలోకి వచ్చినప్పుడు పిలిస్తే నీ ఇంటి ముందర ఉన్న కళాశాల మైదానంలోకి వచ్చి తొడగొడతా లేదా నిన్నైనా కొడతా. ఏం జరుగుతుందో చూద్దాం! తాడిపత్రిలో ఏం జరిగినా, ఎవరు దాడులు చేసుకున్నా వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం నీకే చెల్లు. నీ అనుచరులెవరో మద్యం తాగి రాత్రిళ్లు తిరుగుతూ ఘర్షణ పడితే అది చేసింది వైఎస్సార్‌సీపీ వారే అంటూ రాద్ధాంతం చేయడం సిగ్గుచేటు. ఘర్షణపై పోలీసులకు ఫిర్యాదు ఇవ్వమంటే వారిపై నమ్మకం లేదంటావా? పైగా మేం చెప్పిన సెక్షన్ల ప్రకారమే కేసు నమోదు చేయాలంటూ మూర్ఖత్వంతో వ్యవహరిస్తావా? పోలీసులు ఏం చేయాలో కూడా నీవే చెబుతావా?



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పోలీసులను తిడుతుంటే యూనియన్ ఏం చేస్తున్నట్టు?

జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి డీఎస్పీ, ఎస్ఐ, సీఐలను కార్నర్ చేసి మాట్లాడుతున్నాడు. కలెక్టర్‌ను కూడా ఇష్టానుసారం మాట్లాడాడు. పోలీసులపై ప్రయివేట్ కేసులు వేయిస్తూ, వారిని ఇష్టానుసారం తిడుతున్నా అతనిపై చర్యలకు పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు ఉపక్రమించలేకపోతున్నారో అర్థం కావడం లేదు. ఈ విషయంలో కనీసం పోలీస్ యూనియన్ కూడా స్పందించకపోవడం తగదు. ఉన్నతాధికారులు మాత్రమే పోలీసులా? కింది స్థాయి వారు పోలీసులు కారా? ఇప్పటికీ జేసీ ప్రభాకర్‌రెడ్డికి కొందరు పోలీసు అధికారుల ఆశీర్వాదాలు ఉన్నందునే ఇలా రెచ్చిపోతున్నాడు. వాడి నోరు మంచిది కాదు.. అలాగే వదిలేస్తే ప్రజలే తిరగబడి బుద్ధి చెబుతారు.

నీ రాజకీయ అంతం నీ మండలం నుంచే...

నీ రాజకీయ అంతాన్ని నీ సొంత మండలం (పెద్దపప్పూరు) నుంచే మొదలుపెట్టా. దమ్ముంటే వెళ్లవలా వైఎస్సార్‌సీపీలోకి వచ్చి చేరుతున్న టీడీపీ శ్రేణులను ఆపుకోవాలి. నేను కేవలం జేసీ సోదరుల ఫ్యామిలీ మీద మాత్రమే పోటీ చేస్తా. వారు కాకుండా వేరెవరైనా రాజకీయాల్లో పోటీకి నిలబడితే నేను తప్పుకుంటా. చేతనైతే ఎమ్మెల్యేగా నాతో నీవు పోటీకి దిగి నిరూపించుకో. నీ కుమారుడికి మంచి చెడులు చెప్పి వ్యాపారాలు చేసుకునే అవకాశమివ్వు. ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడం, తద్వారా లబ్ధిపొందడం మీకు (జేసీ సోదరులకు) అలవాటే. నా కుటుంబంలోనే ఒకరిని హత్య చేయించారు. మన మధ్య పగలు, ప్రతీకారం ఉండొచ్చు. కానీ నేను ప్రజల సంక్షేమం కోసం వాటిని ఎప్పుడో పక్కన పెట్టేశా. కానీ మళ్లీ గ్రామాల్లో పగలు, ప్రతీకారాలకు ఆజ్యం పోస్తే చూస్తూ ఊరుకోను. ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకుని.. గౌరవంగా, హుందాగా బతుకు'' అని జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి హితవు చెప్పారు. విలేకరుల సమావేశంలో హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని మాట్లాడారు. జేసీ ప్రభాకర్ రెడ్డి చదువుకున్న సంస్కారహీనుడని, చిల్లరగా మాట్లాడడం ఆయనకే చెల్లుతుందని విమర్శించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే కేతిరెడ్డి పెద్దారెడ్డి సింహంలాంటోడైతే..జేసీ ప్రభాకర్ మాత్రం గుంటనక్కని దుయ్యబట్టారు.

ఫుట్‌బాల్ విజేతగా అనంత బాలికల జట్టు



విజేతగా నిలిచిన అనంత బాలికల జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ పోటీల్లో అండర్–19 విభాగం బాలికల విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్‌లో తూర్పుగోదావరి జట్టుపై 4–0 గోల్స్ తేడాతో విజయకేతనం ఎగురవేసింది. బాలుర జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలో జిల్లా నుంచి జాతీయస్థాయి పోటీలకు అనూష, కీర్తన, మధు, రిషితేజ, నందకిశోర్ ఎంపికయ్యారు. వీరిని జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, రవికుమార్, కో–ఆర్డినేటర్ నాగరాజు, పీడీ నాగరాజు, పీఈటీ రమేష్ తదితరులు అభినందించారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం

- కరోనా పరిస్థితులు లేకుంటే దేశంలో నంబర్ వన్‌గా నిలిచేవాళ్లం
- త్వరలో కొత్త బస్సులు
- ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

గుంతకల్లు టౌన్/ఉరవకొండ: కరోనా ఆర్థిక సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్టీసీని రానున్న రోజుల్లో లాభాల బాటలో నడిపిస్తామని ఆ సంస్థ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆర్టీసీకి రూ.5,400 కోట్ల మేర నష్టం వాట్లిందని, లేకుంటే ఈ సమయానికి ఏపీఎస్ ఆర్టీసీ దేశంలోనే మొదటిస్థానంలో నిలిచి ఉండేదన్నారు. సోమవారం గుంతకల్లు, ఉరవకొండలోని ఆర్టీసీ బస్టాండ్లను ఆయన తనిఖీ చేశారు. నడుస్తున్న సర్వీసులు, డిపో ఆవరణలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉరవకొండలో బస్టాండులో అందుతున్న సౌకర్యాలు, బస్సుల సమయ పాలన తదితర అంశాలపై ప్రయాణికులతో ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



షేక్షానుపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మల్లికార్జున రెడ్డి (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాప్రస్థానం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలోకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలీనం చేసి, 53 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, ఉద్యోగ, ఆర్థిక భద్రత కల్పించారన్నారు. ఒకప్పుడు ఆర్టీసీ కార్మికులకు జీతాలివ్వాలంటే సంస్థ ఆస్తులను తాకట్టు పెట్టాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే నెలకు రూ.300 కోట్లను జీతాల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. రాష్ట్రానికి అతి త్వరలో కొత్త బస్సులు రానున్నాయన్నారు. గుంతకల్లు డిపోను మోడల్‌గా తీర్చిదిద్దడంతో పాటు విజయవాడ, హైదరాబాద్‌కు కొత్త సర్వీసులు నడుపుతామన్నారు. ఉరవకొండ డిపోలోకి వచ్చే బస్సులకు సీసీ ప్లాట్‌ఫాం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జోనల్ చైర్‌పర్సన్ మంజులతో కలసి డిపో ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్. ఆదోని, గుంతకల్లు, ఉరవకొండ డిపో మేనేజర్లు నారాయణస్వామి, బాలాజీ దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో తిరగాలంటే ధైర్యం ఉండాలి

అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత ప్రజల్లోకి వెళ్లాలంటే ఏ పార్టీ నాయకుడికైనా దమ్ము, ధైర్యం ఉండాలని అలాంటి ధైర్యాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులకు అందించారని మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండ మండలం షేక్షానుపల్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జగన్ సర్కార్ ఏర్పడిన ఈ మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.కోట్లు నేరుగా ప్రజల ఖాతాలకు ప్రభుత్వం మళ్లించిందని గుర్తు చేశారు. అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. మూడేళ్లలో నియోజకవర్గ వ్యాప్తం చేసిన అభివృద్ధి పనులు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెన్నోబులేసు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్ పాల్గొన్నారు.

జగన్‌తోనే గాంధీజీ కలల సాకారం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గతంలో పుస్తకాల్లో మాత్రమే చదువుకునేవాళ్లమని.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేసి గాంధీ కలలను సాకారం చేశారని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడారు. సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడి అడుగుజాడల్లోనే సీఎం వైఎస్ జగన్ నడుస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేశారన్నారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, నాటక అకాడమీ చైర్ పర్సన్ హరిత, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, వ్యవసాయ మిషన్ సభ్యుడు రాజారాం, బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ మేయర్ రాగే పరుశురాం, పామిడి వీరాంజినేయులు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రిలాక్స్ నాగరాజు, ఓబులేసు, వేముల నదీం, మనేరి కొండమ్మ, మారుతీ నాయుడు, గోగుల పుల్లయ్య, భారతి, రాధాయాదవ్, కృష్ణవేణి, అంజలి, శోభారాణి, ఉష పాల్గొన్నారు.



గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తడబడిన ఆంధ్ర జట్టు


అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తడబాటుకు గురైంది. దీంతో మ్యాచ్‌పై బిహార్ జట్టు మరింత పట్టు బిగించింది. తొలి రోజు 8 వికెట్లకు 300 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ ప్రారంభించిన బిహార్ జట్టు తొమ్మిదవ ఆటగాడు మయంక్ కుమార్ 44 పరుగుల జోడించాడు. 104.2 ఓవర్లలో 339 పరుగులకు బిహార్ జట్టు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో గిరినాథ్‌రెడ్డి 4, కేఎస్ఎన్ రాజు, ఆంజనేయులు, సందీప్ చెరో 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 73 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 189 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో వంశీకృష్ణారెడ్డి 72 పరుగులు, ధ్రువకుమార్ రెడ్డి 33 పరుగులతో అజేయంగా నిలిచారు. బిహార్ బౌలర్లలో ఆమోద్ యాదవ్ 2, సామిద్, మయాంక్‌కుమార్ చెరో వికెట్ సాధించారు. మ్యాచ్‌పై ఆధిపత్యం సాధించాలంటే ఆంధ్ర జట్టు 150 పరుగులు చేయాల్సి ఉంది.

జాతరకు ముస్తాబు

- ఫిబ్రవరి 2, 3 తేదీల్లో సునామ జకినీ మాత ఉత్సవాలు
- దేశ నలుమూలల నుంచి తరలిరానున్న ఆరె కటికలు

గుత్తి: ఆరె కటికల ఆరాధ్యదైవం సునామ జకినీ మాత ఉత్సవాలు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. దేశంలోనే ఏకైక దేవాలయంగా ఖ్యాతి పొందిన ఈ ఆలయంలో ఏటా జరిగే ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి ఆరె కటికలు భారీగా తరలివస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.





సునామ జకినీమాత మూల విరాట్, గుత్తిలో వెలసిన ఆలయం

ఆరె కటికల కొంగుబంగారంగా..

అరుదైన ఈ ఆలయంలో సునామ జకినీమాత, మాల్కుమని జకినీ మాత కొలువై ఉన్నారు. ఏటా మాఘమాసం రెండో శుక్రవారం సునామ జకినీ మాత జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి రెండు రోజుల జాతరలో వేల సంఖ్యలో ఆరె కటికలు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. సునామ జకినీ మాతను నిర్మలమైన హృదయంతో ఆరాధిస్తే సమస్త కోరికలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

జాతర కార్యక్రమాలు ఇలా...

ఫిబ్రవరి 2న అమ్మవారికి అభిషేకం, మహామంగళహారతి, గణపతి హోమం, శాంతి హోమం, నవ గ్రహ హోమం, అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, గుత్తి ఆర్ఎస్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుంచి పూర్ణకుంభాలతో ఆలయం వరకూ ఊరేగింపు ఉంటుంది. అనంతరం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3వ తేదీ ఉదయం ఏడు గంటలకు అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, గంగ స్నానం వంటి కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం నూతనంగా నిర్మించిన కల్యాణమంటపాన్ని ప్రారంభించి, ఆరె కటికల బహిరంగ సభ నిర్వహిస్తారు. కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



నగల బ్యాగును అప్పగిస్తున్న ఆటోడ్రైవర్ మల్లికార్జున

గుంతకల్లు టౌన్: ఆటోలో బంగారు నగలున్న బ్యాగ్‌ను మరిచిపోయిన ప్రయాణికుడికి తిరిగి వాటిని భద్రంగా అందజేసి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని భాగ్యనగర్‌కు చెందిన మల్లికార్జున ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా ఉంద్రాజవరం నివాసి రాధాకృష్ణ సోమవారం సాయంత్రం 4.45గంటలకు గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండు సమీపంలోని ఓ ఆటో ఎక్కి రైల్వే స్టేషన్‌కు వెళుతూ మార్గమధ్యంలో ఓ హోటల్ వద్ద ఆటో ఆపి టిఫెన్ చేసేందుకు లోపలకు వెళ్లాడు. ఆ సమయంలో ఆటోలో మూడు తులాల బంగారు నగలు, రూ.1,600 నగదు ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయాడు. ఈ విషయం తెలియని ఆటో డ్రైవర్ మల్లికార్జున నేరుగా ఇంటికి చేరుకున్నాడు. ఆటోను శుభ్రం చేస్తుండగా వెనుక ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగ్‌ను గుర్తించి, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించేందుకు వెళ్లాడు. అదే సమయంలో తన బ్యాగ్ పోయిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రాధాకృష్ణకు పోలీసుల సమక్షంలో నగల బ్యాగ్‌ను మల్లికార్జున అందజేశాడు. నిజాయితీ చాటుకున్న మల్లికార్జునను ఈ సందర్భంగా పోలీసులు అభినందించారు.

బీసీలూ అండగా ఉండండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న పైలా నరసింహయ్య, బీసీ సంఘాల నాయకులు

తాడిపత్రి: రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. సోమవారం ఆయన స్థానిక నివాసంలో రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ కుల వృత్తులకు చెందిన నాయకులు, వ్యక్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,30,145 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలకు, అక్కచెల్లెమ్మలకు రూ.330.15 కోట్ల లబ్ధిని నేరుగా వారి ఖాతాల్లోనే సీఎం వైఎస్ జగన్ చేర్చారని గుర్తు చేశారు. టీడీపీతో సహ గత ప్రభుత్వాలన్నీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే గుర్తించాయన్నారు. ఆదరణ పేరుతో నాసిరకం పని ముట్లు, ఇస్త్రీ పెట్టెలు, కుట్టుమిషన్లు తదితర కిట్లను చంద్రబాబు పంపిణీ చేసి బీసీలను బురిడీ కొట్టించారన్నారు. జగన్ హయాంలో అన్నింటా బీసీలకు సముచిత స్థానం దక్కిందన్నారు. బీసీ వర్గాలంటే సమాజానికి బ్యాక్ బోన్ అనేలా తల ఎత్తుకుని సగర్వంగా జీవించేలా చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అన్ని రకాలుగా భరోసా కల్పిస్తూ తోడుగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ప్రతాప్, మాజీ కౌన్సిలర్ డీవీ కుమార్, తిరుపాలు, నాయీ బ్రాహ్మణ నాయకులు రామాంజినేయులు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 87 వినతులు



వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 87 వినతులు అందాయి. బాధితుల నుంచి ఎస్పీ ఫక్కీరప్ప స్వయంగా అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలపై అవగాహన తప్పనిసరి

ఆత్మకూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారని ఎంపీడీఓ కొండన్న తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మార్మోగుతున్న శ్రీరామ నామస్మరణ



శ్రీరామనామ సప్తాహంలో భక్తులు

అనంతపురం కల్చరల్: సోములదొడ్డిలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఈనెల 28 నుంచి సాగుతున్న శ్రీరామ నామసప్తాహంలో ఆళ్లగడ్డ రాము నేతృత్వంలో గోవింద వాసవీ భజన మండలి సభ్యులు కృష్ణమూర్తి, వెంకటస్వామి తదితరులు సప్తాహంలో శ్రీరామ జయరామ మంత్రాన్ని జపించారు. ఆలయ నిర్వాహకులు ప్రమోద్‌స్వామి, గోపి మాట్లాడుతూ వచ్చేనెల 4 వరకు రామసప్తాహం సాగుతుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు

రాప్తాడు: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు వలంటీర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. రెండు రోజుల్లో గృహ సారథులను ఎంపిక చేయాలని సచివాలయ కన్వీనర్లు, మండల స్థాయి నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేద్దాం

రాప్తాడు: బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేద్దామని ఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. సోమవారం మరూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ సాగు పెరగాలి

ఆత్మకూరు: మండలంలో పప్పుశనగ సాగు విస్తీర్ణం పెరగాలని ఇన్‌చార్జ్ ఏఓ వెంకట ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని పి.యాలేరు సమీపంలో పప్పుశనగ పంట కోత ప్రయోగాలు చేశారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం పప్పుశనగ క్వింటా ధర రూ.4,600 నుంచి రూ.5వేల వరకు ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలిమ, ఏఎస్‌ఓ మమత, ఏఈఓ సుజిత పాల్గొన్నారు.

భూ పరిరక్షణ అందరి బాధ్యత



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి

అనంతపురం కల్చరల్: మనిషి స్వార్థ చింతనతో నాశనమవుతున్న భూమి పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు చెందిన సింకోడు పవన్‌కుమార్ అన్నారు. భూ పరిరక్షణ నినాదంతో పవన్‌కుమార్ చేపట్టిన దేశవ్యాప్త పాదయాత్ర సోమవారం రాత్రి అనంతపురానికి చేరుకుంది. పవన్‌కుమార్ మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 17న జమ్ములోని తావి వద్ద పాదయాత్ర ప్రారంభించినట్లు గుర్తు చేశారు. జమ్ము, హర్యానా, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రా, కర్ణాటక ప్రాంతాలు దాటుకుని కన్యాకుమారి వరకూ తన పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకూ 2,900 కిలోమీటర్లు సాగిన పాదయాత్రలో భూ పరిరక్షణపై ప్రజలను చైతన్య పరుస్తూ వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, అనంతపురానికి చేరుకున్న పవన్‌కుమార్‌ను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, సామాజిక కార్యకర్త అనిల్‌కుమార్‌రెడ్డి, అంజనమ్మ తదితరులు అభినందిస్తూ సన్మానించారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రామినేపల్లిలో లబ్ధిదారులకు పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాప్తాడు పంచాయతీలోని రామినేపల్లిలో వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మితో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకే మీ వద్దకు వచ్చానని, ప్రజలతో తెలిపారు. సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు.

టీడీపీ హయాంలో పథకాలు అందేవికాదు:
గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందేవని, ప్రస్తుతం పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రతి పథకం వలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించాలని సీఎం పదే పదే చెబుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ప్రతి కుటుంబానికీ ఏదో ఒక లబ్ధి చేకూరుతుందోనన్నారు. అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ప్రజలకు ధైర్యంగా చెప్పుకునేలా పాలనా జరుగుతుందన్నారు. మూడేళ్లలో జగనన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, ట్రాన్స్‌కో ఏఈ రమాదేవి, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, స్థానిక నాయకులు మన్నల రవికుమార్, రామకృష్ణ, పెద్దిరెడ్డి, చెన్నారెడ్డి, చిరుతల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే ప్రభుత్వంపై విమర్శలు

- నగర మేయర్ వసీం



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: గతంలో ఎన్నడూలేనివిధంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి దిగులు చెందాల్సిన అవసరం లేదని నగర మేయర్ వసీం అన్నారు. తన హయాంలోనే అనంత అభివృద్ధి జరిగిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరంలోని 38వ డివిజన్ పరిధిలో రూ.32 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను నగర కమిషనర్ భాగ్యలక్ష్మితో కలిసి మేయర్ సోమవారం ప్రారంభించారు. నగరంలో గత మూడున్నరేళ్లలో ఆర్థిక నిధులు, జనరల్ ఫండ్స్, గడప గడపకూ మన ప్రభుత్వం నిధుల ద్వారా రూ. 97.34 కోట్లతో అభివృద్ధి చేశామని మేయర్ అన్నారు. స్పెషల్ గ్రాంట్ కింద కూడా రూ. 25 కోట్లతో నగరాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అన్ని డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవతో కృషి చేస్తున్నామన్నారు.

నగరాభివృద్ధిని పట్టించుకోలేదు :
టీడీపీ హయాంలో ఎంపీ, మేయర్, ఎమ్మెల్యే ముగ్గురు మూడు ముక్కలుగా విడిపోయి నగరాభివృద్ధిని పట్టించుకోలేదని మేయర్ విమర్శించారు. ఆయన చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.గత ఐదేళ్ల కాలంలో ఎన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆయన హయాంలో కేవలం పార్కులు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. కేవలం తన ఉనికిని కాపాడుకునేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. నగరాభివృద్ధికి ఎమ్మెల్యే అనంత, ఎంపీ రంగయ్య, నగర పాలక వర్గం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, నాయకులు ఖాజా, చింతకుంట మధు, రవీంద్రారెడ్డి, నాగరాజు, కుమార్, వర్మ, రమేష్, రాధాకృష్ణ, డీఈ రాంప్రసాద్‌రెడ్డి, ఏఈ శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి శంకరమఠ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని శారదానగర్ శృంగేరి శంకర మఠంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మఠం 28వ వార్షికోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఎంఎస్ఎస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 31న కలశస్థాపన సహస్ర మోదక గణపతి హోమం, వచ్చేనెల 1న మహాశివుడికి పాశుపత అభిషేకం, 2న రుద్రాభిషేకం, తదితర పూజలు ఉంటాయన్నారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

అనంతపురం టవర్‌క్లాక్: బీజేపీ కార్యవర్గ సమావేశం స్థానిక అశోక్‌నగర్‌లోని భూపాలం ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు మల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ సునిల్ దియోధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఘనంగా అజ్మీర్ దర్గా వేడుకలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పాతూరు నాల్‌బండ్ వీధిలోని ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ దైవ స్వరూపులు 811వ వార్షిక గంధం, ఉరుసు సోమవారం నిర్వహించారు. ప్రత్యేక ఫాతెహాను చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరత్ సయ్యద్ అహమ్మద్ బాద్‌షా ఖాదిరి తనయులు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాషా ఖాదిరి హాజరయ్యారు.

కుష్టు నివారణకు చర్యలు తీసుకోండి



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం



కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

అనంతపురం సప్తగిరి సర్కిల్: కుష్టు నివారణకు చర్యలు తీసుకోండని జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ పిలుపునిచ్చారు. యాంటీ లెప్రసీ డేను పురస్కరించుకుని స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు సోమవారం ర్యాలీ చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యాధిపై అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని 31 మండలాల్లోని 44 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు అనుపమ జేమ్స్, ఓబులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో, పంచాయతీల్లో ఫిబ్రవరి 13 వరకు కుష్టుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సునీల్, సుబిహా సుల్తానా తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం న్యూఢిల్లీ టీమ్ డాక్టర్ ప్రియా సెంథిల్ మెడికల్ కళాశాల విజిట్‌లో భాగంగా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుష్టు వ్యాధికి సంబంధించి గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

రాప్తాడు: అవగాహనతోనే కుష్టు నివారించొచ్చని వైద్యాధికారి శివకృష్ణ పేర్కొన్నారు. కుష్టు వ్యాధిపై రాప్తాడులో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది కుష్టు లక్షణాలు తెలుసుకుని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 104 వైద్యాధికారి శివశంకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ 104, 108 సేవలను వినియోగించుకోవాలన్నారు.

బాలికల హాకీ పోటీల్లో అనంతకు తృతీయ స్థానం



తృతీయ స్థానంలో నిలిచిన అనంత బాలికల జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనకాపల్లి జిల్లా యలమంచిలి వేదికగా నిర్వహించిన జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో అనంత బాలికల జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. సెమీస్‌లో అనకాపల్లి జట్టుతో ఓటమిని చవిచూసి తృతీయ స్థానంలో నిలిచింది. జిల్లా జట్టును జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌రాజ్‌కుమార్, మారుతీప్రసాద్, గట్టు నాగరాజు, కోచ్ రోషిత ప్రత్యేకంగా అభినందించారు.

ఫేషియల్ హాజరు రద్దుచేయాలి

అనంతపురం అర్బన్: మున్సిపల్ కార్మికులకు ఫేషియల్ హాజరు తొలగించి, పాత పద్ధతిలో హాజరు తీసుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ ఫేషియల్ హాజరుతో మున్సిపల్ కార్మికులు ఇబ్బందిపడుతున్నారన్నారు. వీరికి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, నాగరాజు, శివకృష్ణ, నాగేంద్రబాబు, సుజాత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న అనంత చంద్రారెడ్డి, కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనారోగ్యంతో బాధపడుతున్న పెయింటర్ బాబును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ పరామర్శించారు. నగరంలోని ఓబులదేవ్‌నగర్‌కు చెందిన బాబు కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కర్నూలులో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంత చంద్రారెడ్డి సోమవారం కార్పొరేటర్ సాకే చంద్రతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు శ్రీన, రియాజ్, లక్ష్మోజి, కాకర్ల శ్రీన, కిరణ్, బుల్లెట్ శివ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతం అనుసరణీయం



మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు అనుసరణీయమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు.సోమవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ జాతికి అందించిన సేవలను కొనియాడారు. ప్రధానంగా సత్యం, అహింస ఆయన నమ్మిన ఆయుధాలను పేర్కొన్నారు. నేటి తరం గాంధీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం: మహాత్మాగాంధీ అంతర్జాతీయ దార్శనికుడు అని నగర మేయర్ వసీం అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి
అనంతపురం కల్చరల్: నగరంలోని గాంధీజీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, గోవింద భజన మండలి సభ్యులు, కళాకారులు పూలమాల వేసి, నివాళులర్పించారు. సోమవారం గాంధీజీ 75వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు విజయ్, పుల్లయ్య, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోలేనిది



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేదోడు లబ్ధిదారులు

ఆత్మకూరు: జగనన్న రుణం తీర్చుకోలేనిదని జగనన్న చేదోడు లబ్ధిదారులు అన్నారు. సోమవారం మండలంలోని జగనన్న చేదోడు లబ్ధిదారుల ఖాతాలకు రూ.10 వేలు నగదు జమ అయ్యింది. ముందుగా మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మండల వ్యాప్తంగా 190 మంది లబ్ధిదారులకు జగనన్న చేదోడు వర్తించిందని ఎంపీడీఓ కొండన్న తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రాముడు, వెంకటేష్, లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహా,అంజినప్ప, పోతన్న, గోవింద్, మాధన్న, రాము, మురళి, శ్రీరామ్, ఓబీ టైలర్ వెంకటేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.24 కోట్లతో రుద్రంపేట అభివృద్ధి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీలో రూ. 24 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు కల్పించామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రాబోవు రోజుల్లో అనంతపురం నగరంతో పాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి రుద్రంపేట పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. గాంధీజీ ఆశయాలకనుగుణంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజల ముంగిటకే పాలనను తీసుకొచ్చారన్నారు.

టీడీపీకి చిత్తశుద్ధి లేదు :
టీడీపీ నాయకులకు ప్రజల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే అన్నారు. కేవలం అధికారం కోసమే కుటిల రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పాలన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న పాలనపై తాము ప్రజలకు చెబుతున్నామన్నారు. నారా లోకేష్‌కు దమ్ము ధైర్యం ఉంటే చంద్రబాబు అధికారంలో ఉండగా సాగించిన పాలనపై ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. అనంతపురం నగరానికి దీటుగా రుద్రంపేట పంచాయతీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. నారా లోకేష్‌కు దమ్మూధైర్యం ఉంటే తన తండ్రి చంద్రబాబు అధికారంలో ఉండగా 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై తన పాదయాత్రలో ప్రజలకు చెప్పాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సవాల్ విసిరారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు మహబూబీ, లక్ష్మీనారాయణమ్మ, ఓం ప్రకాశ్, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాస రెడ్డి, గౌస్‌బేగ్, సాధిక్‌వలి, గోవింద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, కృష్ణవేణి, పురుషోత్తం, కొర్రపాడు హుస్సేన్‌పీరా, మల్లెల వేణుగోపాల్, అంజి పాల్గొన్నారు.

సంక్షేమానికి బాట వేసిన సీఎం జగన్
అనంతపురం సప్తగిరి సర్కిల్: సంక్షేమానికి బాట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం నగర పరిధిలోని స్థానిక 35వ డివిజన్‌లో నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కొండ్రెడ్డి రాధ, కన్వీనర్ ప్రకాష్‌రెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివరించి, బుక్‌లెట్ అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు ఈ ప్రభుత్వం పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీలు అడ్డుకుంటున్నాయన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర డైరెక్టర్లు శ్రీదేవి, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కేవీ రమణ, కార్పొరేటర్లు సాకే చంద్ర, సైపుల్లాబేగ్, నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయుకులు నిహార్‌రెడ్డి, నరసింహులు, కువైట్ ఖాదర్ బాషా, కృష్ణవేణి, శోభాబాయి, పార్వతి, ఉష, షేక్ జావిద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్చికల్లా ఫ్లై 'ఓవర్'

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- బ్రిడ్జి పనుల పరిశీలన

అనంతపురం సిటీ: టవర్‌క్లాక్ సమీపంలో చేపట్టిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) పనులు రెండు వైపులా ఈ ఏడాది మార్చికల్లా పూర్తి చేయించి, రాకపోకలు పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఫ్లైఓవర్ బ్రిడ్జితో పాటు వెహికల్ అండర్ పాస్ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. బ్రిడ్జికి ఒకవైపు సర్వీస్ రోడ్డు పనులు జరిగాయని, మరోవైపు(శాంతి థియేటర్ వైపు) పనులూ తక్షణం చేపట్టాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మార్చికల్లా పనులు పూర్తి చేయాలనే పట్టుదలతో ముందుకెళ్తున్నామని, ఇందుకు మీరంతా సహకరించాలని వ్యాపారులతో పాటు స్థానికులను కోరారు. ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో బ్రిడ్జి వెడల్పు 7.5 మీటర్లు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం ఒక్కొక్క వైపు 9.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం



ఆత్మకూరులో ప్రభుత్వ పథకాలపై సర్వే చేయిస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: ప్రభుత్వం కుల మత, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు అందిస్తోందని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. సోమవారం మండల వ్యాప్తంగా (సీఓపీ) సిటిజన్ ఔట్రీచ్ ప్రోగ్రాం సర్వే చేపట్టారు. ఈ సర్వేలో భాగంగా పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రనిధులు ప్రతి ఇంటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. ఏ ఇంటికి ఎంత మేర పథకాల ద్వారా లబ్ధి చేకూరిందో? ఎన్ని పథకాలు వర్తించాయో అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా తదితర పథకాల లబ్ధిని తెలుసుకున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గైనిక్ విభాగంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సోమవారం నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కలిగించేందుకు డాక్టర్ ప్రశాంతి నేతృత్వంలో మహిళలకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహిస్తున్నామన్నారు.

సజావుగా కౌన్సెలింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జీఎన్ఎం శిక్షణ కోర్సుల ప్రవేశాలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. జిల్లా వ్యాప్తంగా 464 మందికి కాల్ లెటర్లు పంపగా హాజరైన వారిలో 316 మందికి సీట్లు కేటాయించారు. మంగళవారం రెండో రోజు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, ఏఓ ప్రభాకర్ మోజెస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం



ర్యాక్‌ను అందజేస్తున్న పంచాయతీరాజ్ ఈఈ మల్లికార్జున మూర్తి

అనంతపురం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఎక్కువ శాతం పేదలేనని, వారి బంగారు భవితకు ఉపయోగపడేలా ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటునందించాలని పంచాయతీరాజ్ శాఖ(క్వాలిటీ కంట్రోల్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) మల్లికార్జున మూర్తి పిలుపునిచ్చారు. అనంతపురం భాగ్యనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన లైబ్రరీకి అవసరమైన పుస్తకాల ర్యాక్‌ను ఎన్‌కేసీ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అందించారు. సేవా సమితి వ్యవస్థాపకుడు కమల్‌నాథ్, ఉపాధ్యక్షుడు రమణ, సివిల్ ఇంజినీర్ అల్తాఫ్‌ఖాన్, హెడ్మాస్టర్ బాబాఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.